**నగరంలో** ఉదయం కళ్ళు విప్పక తప్పదు.

విప్పిన కళ్ళు రేపుకి స్వాగతం చెప్పకా తప్పదు.

రాలిపోయిన పువ్వు లాంటి 'నిన్న'ను నలిగిపోయిన వస్త్రంలా, పండిపోయిన ఆకులా, ప్రాణం లేని శరీరంలా చూసే మనుషుల్ని పలకరిస్తూ వస్తాడు సూర్యుడు.

'నిన్నను చంపింది నువ్వే కద?' అని సూర్యుణ్ణి అడిగే దమ్ము లెవరికీ ఉండవు.

అందుకే సూర్యుడు పాలిష్ చెరగకుండా ఉదయ కవాటాలు తెరుచుకొంటూ లోకం మీదికి విహారానికి బయలుదేరతాడు.

'ఈ రోజు' జీలగా చావు కెదురు చూస్తూ 'రేపు' లో మరణిస్తుంది.

ఇది నిత్య స్రవంతి.

ఇది నిరంతర మరణ వలయ భీతి.

భీతి పాదాలకూ, మనసుకూ సంకెళ్ళు వేస్తుంది.

ఆ సంకెళ్ళు ఒక పట్టాన తెగవు.

ఇప్పుడు 'వినోది'ని వేధిస్తున్న సంకెళ్ళు అవే.

'వినోది' అసలు పేరు నరసింహమూర్తి.

మనిషి అటు నరుడూ కాదు, ఇటు సింహమూ కాదు అన్నట్లు ఉంటాడు. అటూ ఇటూగా సర్కస్ బఫూన్‌లా ఉంటాడు.

మనిషి నవ్వకపోయినా, ఆ మనిషిని చూస్తే నవ్వు వస్తుంది. వినోదం తన జన్మవరం కనక అదే తన కలంపేరుగా పెట్టుకున్నాడు నరసింహమూర్తి.

తొలిగా అతని రచనలు పాఠకుల ఉత్తరాలే.


అందులోనే తన పేరు చూసుకుని ఆనంద పడుతూ మంచి ఉత్తరాలూ, విమర్శలూ, మంచి విమర్శలూ, ఛందస్సు బాధ లేని కవితలూ, అందులో కూడా ఒకటుచక్రంతో తిరిగే కవితలూ—కొత్త కలాలుగా వ్రాసిన ముక్త ఛందస్సుల్లోంచి పాత కలంగా మారేసరికి అతని చూపుల్లో, మాటలో గాంభీర్యం వచ్చేసింది.

లోకం తనను గుర్తించకపోతేనేం? తనలో అదృశ్యంగా 'వాల్మీకి'లా ఒక మహాకవి ఎదుగుతున్నాడనే నమ్మకం కలిగింది.

ఆ నమ్మకం అతని చేత శరపరంపరగా రచనలు చేయించింది.

పత్రికా ప్రపంచంలోకి అతని శరాలు చాలా దూరంకు వెళ్ళాయి.

"వినోది గారి కథలు మీ రెప్పుడైనా చదివేరా?" అని సంభాషణ ప్రారంభించేవాడు రైళ్ళల్లోనో, బస్సులోనో ప్రయాణిస్తూ.




ఆ సంభాషణలో అవతలి మనిషి నుండి తను ఆశించిన సమాధానాలు రాక "నేనే ఆ మహాకవిని" అని చెప్పి విరగబెట్టుకోవాలని పడిన తాపత్రయం నీరు కారిపోగా, పదేళ్ళ వయసు పైన పడినట్లు కుంగి పోయేవాడు.

రేపు. . .రేపు. . .రేపు. . .

ఇదే అతనిలో అహరహం ప్రతిస్పందించే తారక మంత్రం.

"రేపు నేను శ్రీశ్రీని జయిస్తాను.

శ్రీశ్రీ చేత ఓహో అనిపించుకుంటాను.

రేపు నేను మరో కొత్త కవితా శిఖరం అధిరోహిస్తాను.

నా పేరిట మరొక నక్షత్రం ఆకాశంలో వెలుస్తాను.

రేపటి నా రూపం

మరెన్నో రేపులకు మార్గదర్శకం—"

ఇలా పిచ్చి పిచ్చిగా డైరీలు నింపుకునే వాడు.

అతని డైరీలు ఎవరూ చదవరు.

'వినోది' ప్రపంచాన్ని చూస్తూ భావావేశంలో కొట్టుకు పోయేవాడు.

ఎదురుగా కనుపించే దృశ్యాలను అద్భుతంగా వూహించే వాడు. అతని కవితా హృదయానికి గడ్డిపువ్వులో సైతం కావ్యదృష్టికి అనువైన పదార్థం తోచేది.

శ్రీనాథుడిలాగే ప్రకృతిని చూసి ఉంటాడు;

నన్నయ్య ఇలా వూహించి ఉంటాడు;

విశ్వనాథ ఇలా రచించి ఉంటాడు;

శ్రీ శ్రీ కవితాధార ఈ విధంగా ప్రవహించి ఉంటుంది;

నగ్నముని అగ్ని హృదయం ఇలా మండింది కాబోలు—

అంటూ తన లోని ప్రతి కదలికనూ, భావననూ కొలిచేవాడు, తలచేవాడు.

అతని కలమే అంతరాత్మే నేస్తం.

అందువల్ల అతని భావ ప్రసరణ బహిర్గతం కానేలేదు.

రచనల్లో పలికింది, ఒలికించింది ఒక్కటంటే కనక, అది అంతగా ఎవర్నీ వేధించి, బాధించి కన్నీరు చిందించలేదు.

వినోది హృదయమే భువన విజయం.

అతని భావతరంగాలే కవిదిగ్గజాలు. అతను శ్రీకృష్ణరాయలు.

అతని సామ్రాజ్యం అవిచ్ఛిన్నంగా అరవై ఏళ్ళు సాగింది.

వార్ధక్యం తనువు మీద విరబూసింది.

ఇప్పుడతనికి లోకం కొత్తగా కనిపించింది.

దూరంగా ఎక్కడో చిరుగంటలు వినిపించసాగాయి.

అవి ఏ ద్వారం పలికే స్వాగతాలో!

వినోది కిప్పుడు ప్రపంచాని కేదైనా చెప్పాలనే తపన లేదు. కానీ, సిన్నటి దాకా నిర్లక్ష్యం చూపిన ప్రపంచం నేడతణ్ణి వినాలని తపించి పోతూంది!

నిన్న కేసి జాలిగా చూస్తున్నాడు వినోది. అతనిలోని వేదాంతి, రేపు కేసి "నువ్వేంటో నాకు తెలుసు—నీ మాయతో నువ్వు భ్రమపెట్టకు" అన్న భావనతో చూసి లోలోపల నవ్వుకుంటున్నాడు.

కలాన్ని ఒక్క మాట—ఒకే ఒక్క మాట—కదిలించి కమ్మగా నాలుగు మాటలు వ్రాయదలిచాడు వినోది.

ఆ నాలుగు మాటలూ అతణ్ణి ముప్పు తిప్పలు పెట్టి కానీ కాగితం మీదకు రాలాయి కాదు.

"ఓ మనసా!

నువ్వు ఎవరో పాపం! నాకు తెలియదు. ఇన్నేళ్ళు ఓపికగా నాతో నేస్తం చేశావు.

నేను ఈ జీవితాన్ని అర్థం చేసుకోవాలని శ్రమిస్తూ నిన్ను నిర్లక్ష్యం చేశాను.

క్షమించు.

ఇన్నాళ్ళూ వినిపించని గొంతు నాకు వినిపిస్తూంది.

అది నీదేనని అర్థమవుతూంది.

కానీ, ఏం చెయ్యను?

అశక్తుణ్ణి.

రేపు నా కేమీ మిగిలదు.

చివరికి నువ్వుకూడా. . ."

★


రేపు
CHANDRA
-కాటూరు
రవీంద్ర త్రివిక్రమ్